
- ఇప్పటివరకూ చేపట్టని నిర్మాణ పనులు
- నూతన విద్యా సంవత్సరం మొదలైనా కానరాని చర్యలు
- సుద్దులంలో భూసేకరణకు అటవీ శాఖ కొర్రీలు
- బోధన్ మండలం బెల్లాల్‌లో ఏర్పాటుపై అస్పష్టత
- ప్రతిపాదనల్లోనే నిజామాబాద్ అర్బన్, బాల్కొండ
- భూసేకరణ, నిధులు లేకుండానే సర్కారు హడావుడి
- చొరవ చూపని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు



ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ఏర్పాటుపై కానరాని ముందడుగు

25 ఎకరాల్లో రూ.200 కోట్లతో నిర్మాణం..

# ప్రకటనలకే పరిమితం!

పేద విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం సమీకృత గురుకుల స్కూళ్లను ఏర్పాటుచేయాలని నిర్ణయించినట్లు చెప్పుకుంటున్నది. అంతర్జాతీయ ప్రమాణాలతో రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణం చేపడుతున్నామని పేర్కొంటున్నారు. ప్రకటనలకు దీటుగా పనులు మాత్రం జరగడం లేదు. గతేడాది అక్టోబర్ 11న రాష్ట్రవ్యాప్తంగా 19 నియోజకవర్గాల్లో తొలి దశలో శంకుస్థాపనలు చేయడంతో ఈ ప్రక్రియ మొదలైంది. 25 ఎకరాల్లోపు స్థలాన్ని సేకరించి ఒకే చోట ఒకటి నుంచి ఉన్నత విద్య వరకు విద్యను అభ్యసించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో సీటు దక్కించుకున్న విద్యార్థికి రూపాయి ఖర్చు లేకుండానే నాణ్యమైన విద్య అందుతుందని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్నది. ఈ కార్యక్రమాన్ని సర్కారు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు చెబుతుండగా ఉమ్మడి జిల్లాకు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు మోక్షం లభించకపోవడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి జిల్లా నుంచి నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ ప్రభుత్వాన్ని ఒప్పించి ప్రతిష్టాత్మక స్కూల్స్ నిర్మాణాలు చకచక చేపట్టడంలో విఫలమైయ్యారనే అభిప్రాయం ప్రజల్లో ఏర్పడింది. బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్న బాల్కొండ, కామారెడ్డి, నిజామాబాద్ అర్బన్‌లో యంగ్ ఇండియా స్కూళ్ల ముచ్చటే కరువైంది. ప్రతిపాదనలకే పరిమితమైంది. పరిపాలన అనుమతులూ రాలేదు. బోధన్‌లో బెల్లాల్‌లో ఏర్పాటుకు నిశ్చయించినట్లుగా తెలిసినా, అధికారికంగా ప్రకటన చేయలేదు.

నిజామాబాద్, జూన్ 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం కేవలం మాటలకే పరిమితమైంది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఇప్పటి వరకు నాలుగు నియోజకవర్గాలకు వీటిని మంజూరు చేసినట్లు ప్రకటించింది.కానీ ఇప్పటివరకు భూసేకరణ, నిధులు మంజూరు ప్రక్రియ పూర్తికాలేదు. ఇప్పటికే పాత విద్యా సంవత్సరం పోయి మరో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైంది. అయినప్పటికీ పాలకుల్లో చలనం కరువైంది. కామారెడ్డి జిల్లాలో ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల్లో మంజూరవగా, నిజామాబాద్ జిల్లాలో బాన్సువాడ, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్‌లో ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఏ ప్రాంతంలో ఎప్పటిలోపు ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ఏర్పాటు చేస్తారనే విషయంపై స్పష్టత కొరవడింది. మొదటి విడుతలో 19 నియోజకవర్గాలు, రెండో విడుతలో 20 నియోజకవర్గాల్లో స్కూళ్ల నిర్మాణ పనులకు రాష్ట్ర వ్యాప్తంగా శంకుస్థాపన చేశారు. ఉమ్మడి జిల్లాలోనూ జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్‌లోనే శంకుస్థాపనలు జరిగాయి. బాన్సువాడ నియోజకవర్గం పోతంగల్ మండంలోని పీఎస్ఆర్ నగర్(సోంపూర్ శివారు)లో 20 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. మద్నూర్‌లో నెలలు గడుస్తున్నా పునాది రాయి తీసింది లేదు. బాల్కొండ, నిజామాబాద్ అర్బన్, కామారెడ్డి నియోజకవర్గాలకు సంబంధించిన యంగ్ ఇండియా స్కూళ్ల ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమైంది.

### తట్టెడు మట్టి తీయలేదు

యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ మంజూరుపై ఆర్మూర్ నియోజకవర్గానికి సంబంధించి బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి ఘనంగా ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి యంగ్ ఇండియా స్కూల్‌ను సాధించినట్లుగా సోషల్ మీడియాలోనూ చెప్పుకున్నారు. తీరా నెలలు గడుస్తున్నా శంకుస్థాపన ముచ్చటే లేకుండా పోయింది. అంక్సాపూర్ లేదంటే అంకాపూర్‌లో ఏర్పాటు చేయాలని యంత్రాంగం యోచిస్తుండగా ఒక్క అడుగూ ముందుకు పడలేదు. నిజామాబాద్ జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లోనూ భూముల కొరత వేధిస్తున్నది. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరైనట్లు చెబుతున్నారు. రూరల్ నియోజకవర్గానికి సంబంధించిన యంగ్ ఇండియా స్కూల్‌ను డిచ్‌పల్లి మండలం సుద్దులం గ్రామం ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేయాలని అధికార యంత్రాంగం, ఎమ్మెల్యే నిర్ణయించారు. ఇక్కడ 25 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. నోటిఫికేషన్ ఇచ్చే సమయానికి ప్రతిపాదిత స్థలంలో అటవీ శాఖ భూములు ఉన్నట్లు అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీంతో ఏర్పాటు ప్రక్రియ అటకెక్కింది. తొమ్మిది ఎకరాలకు అటవీ శాఖ కొర్రీలు పెడుతున్నది. 14 ఎకరాలకు అభ్యంతరాలు లేవు. కానీ 25 ఎకరాలు స్థలం అవసరం ఉంది. బాన్సువాడలో మంజీరా నది పరీవాహక ప్రాంతమైన పోతంగల్ మండలంలో ఏర్పాటు చేయబోతున్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో లింగంపేట మండలం మోతె గ్రామంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇక్కడ 25 ఎకరాలను బదిలీ చేయబోతున్నారు. జుక్కల్‌లో మద్నూర్‌లో శంకుస్థాపన జరిగినప్పటికీ తట్టెడు మట్టి ఎత్తలేదు. పనులు కూడా షురూ కాలేదు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నట్లుగా చెబుతున్నప్పటికీ మాటలకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పరిమితమైనట్లు ప్రజలు భావిస్తున్నారు. వీటి నిర్మాణాలు పూర్తి కావడానికి సుమారు రెండేండ్లు పట్టే అవకాశం ఉన్నది. అడ్మిషన్లు స్వీకరించి తరగతులు ప్రారంభించే నాటికి అసెంబ్లీ ఎన్నికలు వచ్చే వీలుంది. భారీ వ్యయంతో సుమారు 25 ఎకరాల్లో నిర్మించ తలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం ఇప్పట్లో పూర్తవడం కష్టతరమే. సుమారుగా రెండు నుంచి మూడేండ్ల వరకు పట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

### త్వరలోనే టెండర్లు

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించాం. కొన్నింటికి పరిపాలన అనుమతులు మంజూరు కావాల్సి ఉంది. టెండర్లు త్వరలోనే పూర్తవుతాయి.

**- జి.రవి, డీఈ, తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్,ఉమెన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, నిజామాబాద్ జిల్లా**



ట్యాంకర్ నుంచి పైపు ద్వారా నీటిని పట్టుకుంటున్న కాలనీవాసులు

# కామారెడ్డిలో తాగునీటి కష్టాలు

వికాస్‌నగర్‌లో ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా

కామారెడ్డి, జూలై 15: కామారెడ్డి పట్టణంలో ప్రజలను తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటికీ మిషన్ భగీరథ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఇప్పటికీ భగీరథ ద్వారా పట్టణాలతోపాటు గ్రామాలు, పల్లెల్లో సరఫరా అవుతున్నది. ప్రస్తుతం జిల్లాకేంద్రంలోని పలు కాలనీల్లో నీటి ఇబ్బందులు తప్పడంలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తాగునీటి బెడద తీవ్రంగా మారింది. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, స్థానిక ఎమ్మెల్యే కాటిపల్లి వెంకరమణారెడ్డి ఉన్నప్పటికీ పట్టణంలో నీటి సమస్య పరిష్కారం కావడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పట్టణంలోని వికాస్‌నగర్‌లో తాగునీటి సరఫరా చేసే మోటర్ పాడవడంతో రెండు రోజుల నుంచి నీటి కష్టాలు మొదలయ్యాయి. దీంతో చాలా కాలనీల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. మున్సిపల్ పాలకవర్గం కూడా లేకపోవడంతో నీటి సమస్యను పరిష్కరించేవారే కరువయ్యారు.

**లక్షా 20వేల మందికి నీటి సరఫరా..**


కామారెడ్డి పట్టణంలో సుమారు లక్షా 20 వేల మందికి మిషన్ భగీరథ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. కొందరు మాజీ కౌన్సిలర్లు వారి ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తుండగా.. కాలనీవాసులు వాటిని డ్రమ్ముల్లో నిల్వ ఉంచుకొని వాడుకుంటున్నారు. పట్టణవాసులకు సరిపడా నీటిని సరఫరా చేయకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదు. కొన్నిచోట్ల నాసిరకం పైపులను బిగించడంతో అవి పగిలిపోయి నీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నీటి ఇబ్బందులపై మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌ను ఫోన్ ద్వారా సంప్రదించగా.. భూగర్భ జలాలు అడుగంటడంతో నీటి సమస్య ఏర్పడిందని, ఎనిమిది ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు.




ట్యాంకర్ నీటి కోసం బిందెలతో ఎదురుచూస్తున్న కాలనీవాసులు

# పొలాలపై వానర దండు

బాన్సువాడ రూరల్, జూన్ 15 : మండలంలోని పలు గ్రామాల్లో కోతులు పంటలపై దాడులు చేస్తున్నాయి. వానకాలం పంటల సాగు కోసం రైతులు సిద్ధం చేసుకుంటున్న నారుమళ్లను ధ్వంసం చేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వానర దండు నారుమడుల్లో నారును పెకిలించి నష్టం కలిగిస్తున్నాయి. కోతుల బెడదను నివారించేందుకు రైతులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. ఉదయం గ్రామాల్లో ఉంటున్న కోతులు మధ్నాహ్న సమయంలో పొలాల్లోకి వచ్చి నారుమడులను ధ్వంసం చేస్తున్నాయి.



బోర్లంలో నారుమళ్లను ధ్వంసం చేస్తున్న కోతులు

# నిధులు లేక.. నిలిచిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్





**నిజామాబాద్** జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు చేపట్టారు. నిధులు కేటాయించగా నిర్మాణ పనులను ప్రారంభించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో నిధుల లేమితో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. దీంతో నిర్మాణంలో ఉన్న భవనం చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా మారింది. పాములు, విష కీటకాలు వస్తున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులను పూర్తిచేయించాలని కోరుతున్నారు.

–స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



ధ్వంసమైన ఫ్లోరింగ్



భవనం చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు

# ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

మోర్తాడ్, జూన్ 15: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతం నుంచి ఆదివారం 2,083 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు (80.5 టీఎంసీలు) కాగా ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 1063.20 అడుగుల (13.833టీఎంసీలు)నీటి నిల్వ ఉన్నది. ప్రాజెక్ట్ నుంచి 692 క్యూసెక్కులు అవుట్ ఫ్లో గా వెళ్తున్నది. ఇందులో 100 క్యూసెక్కుల నీటిని కాకతీయ కాలువకు, మిషన్‌భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా 361 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వెళ్తున్నది. జూన్ 1 నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి 1.865 టీఎంసీల ఇన్‌ఫ్లో రాగా, 0.818 టీఎంసీల నీరు అవుట్‌ఫ్లోగా వెళ్లినట్లు అధికారులు తెలిపారు.



త్రివేణి సంగమంలో కొత్తనీరు

**త్రివేణి సంగమంలోకి వరద**

రెంజల్, జూన్ 15 : ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని కందకుర్తి సమీపంలో ఉన్న త్రివేణి సంగమంలోకి వరద వచ్చి చేరుతున్నది. వేసవికాలంలో ఏడారిని తలపించిన త్రివేణి సంగమ క్షేత్రం.. కొత్తనీటి చేరికతో జలకళ సంతరించుకుంటున్నది. గోదావరిలోకి కొత్త నీరు రావడంతో పర్వదినాల్లో పుణ్య స్నానాలు ఆచరించే భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పోలీసు సిబ్బంది

# అ‘పూర్వ’ సమ్మేళనం

వినాయక్‌నగర్, జూన్ 15: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో ఉమ్మడి జిల్లా పోలీస్ సిబ్బంది ఆదివారం అపూర్వ సమ్మేళనం జరుపుకొన్నారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని వివిధ పోలీస్‌స్టేషన్లలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తిస్తున్న 2000 సంవత్సరం కానిస్టేబుల్ బ్యాచ్‌కు చెందిన సిబ్బంది 25 ఏండ్లు సర్వీస్ పూర్తి చేసుకున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలను జరుపుకొన్నారు. ఎన్నో ఏండ్ల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు యోగాక్షేమాలు తెలుసుకొని సాయంత్రం వరకు ఉల్లాసంగా గడిపారు.